క్లుప్తంగా

క్లాత్ బ్యాగుల పంపిణీ



క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు

గాజువాక: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జేడీ ఫౌండేషన్, జీవీఎంసీ సంయుక్తంగా క్లాత్ బ్యాగులు పంపిణీ చేశాయి. గాజువాక మహిళా రైతు బజార్ వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ప్లాస్టిక్‌ను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను వినియోగదారులకు వివరించారు. అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని, గుడ్డ,నార సంచులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావు, జేడీ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



మహిళలు, గర్భిణులు, చిన్నారులతో సూపర్‌వైజర్ సుజాత

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డే ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ పిల్లలకు ఏం కావాలి, తల్లులకు ఏం కావాలి, ఎలాంటి ఆటలు నేర్పాలో తెలియజేశారు. ప్రీ యాక్టివిటీస్, బాలింతలకు, గర్భిణులకు పౌష్టిక ఆహారం గురించి తెలియజేశారు. ప్రాథమిక విద్య, పిల్లల సమగ్ర అభివృద్ధి, సంరక్షణే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, సచివాలయ మహిళా పోలీసు పాల్గొన్నారు.

స్టీల్ బీఎంఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీఎంఎస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఎం. రామస్వామి అధ్యక్షుడిగా, జెర్రిపోతుల రమణ ప్రధానకార్యదర్శిగా, గురుప్రసాద్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, రామస్వామి కోశాధికారిగా, ఎం. పెంటారావు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మరో తొమ్మిది మందిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. బీఎంఎస్ వ్యవస్థాపక సభ్యుడు ఓ. హనుమంతరావు గౌరవాధ్యక్షుడిగా నియమించారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు కొనసాగుతుంది.

ఐక్య ఉద్యమాలే శరణ్యం

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిరక్షణకు ఐక్య ఉద్యమాలే శరణ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో చేపట్టిన 1423వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ద్వంద వైఖరి అవలంబిస్తూ కార్మికులు, నిర్వాసితులను మోసం చేస్తున్నాయన్నారు. కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు కారు రమణ, పి.వి.రమణమూర్తి, సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దాబాలో అగ్ని ప్రమాదం

అక్కిరెడ్డిపాలెం: షార్ట్ సర్క్యూట్ వల్ల దాబాలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రం డీఎఫ్‌వో గోపాల కృష్ణ, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం వేకువ జామున 2 గంటల సమయంలో నాతయ్యపాలెం జాతీయ్య రహదారి సర్వీసు రోడ్డు పక్కనున్న ఎస్‌కేఎంఎల్ మెస్ అండ్ దాబాలో పొగ వచ్చి క్రమేపీ పెద్ద మంటలు చెలరేగాయి. వెంటనే తేరుకున్న స్థానికులు పెదగంట్యాడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక లీడింగ్ ఫైర్‌మెన్ వి.రాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో షెడ్డు పూర్తిగా దెబ్బతినడంతో పాటు ఎలక్ట్రికల్ వైర్లు, ఇతర పరికరాలు అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అన్నారు.

మొక్కవోని దీక్ష



మెట్లకు అందమైన మొక్కలు



మేడపై పెంచుతున్న రకరకాల మొక్కలు



ఇంటి మిద్దెపై పెంచుతున్న రకరకాల మొక్కలు

- 40 జాతులు... 200 మొక్కల పెంపకం
- ఇంటి పెరడు, మిద్దెపై పరుచుకున్న పచ్చదనం
- పర్యావరణ హిత మొక్కలకు చోటు
- ప్రశంసలు అందుకున్న రామఅప్పారావు

పట్టు పడితే సడలని దీక్షాపరుడు.. ఉక్కులో ఉద్యోగ విరమణ తర్వాత సమాచార హక్కు చట్టం ఉద్యమకర్తగా మారారు. అన్యాయం జరిగిన వారికి అండగా నిలుస్తున్నారు. అంతటితో ఆగకుండా పర్యావరణ పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్నారు. మొక్కల పెంపకం వల్ల ప్రయోజనాలను వివరించడంతో పాటు తన ఇంట్లో పర్యావరణానికి మేలు చేసే మొక్కలు పెంచుతున్నారు అగనంపూడి కొండయ్య వలస నిర్వాసితకాలనీకి చెందిన పట్టారామఅప్పారావు.

అగనంపూడి: ప్రస్తుతం అంతటా వినిపిస్తున్న మాట పర్యావరణ పరిరక్షణ. అది సాకారం కావాలంటే ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టాలి. విస్తృతంగా మొక్కలు పెంచాలి. ఆ మాటలను స్ఫూర్తిగా తీసుకున్న రామఅప్పారావు వ్యర్థాలకు అర్థాలు చెప్పే కళాకృతులకు రూపాన్ని ఇస్తున్నారు. ప్రాణవాయువే మనిషి మనుగడకు జీవనాధారం అని గుర్తించి ఇంటి ఆవరణ, పెరడు, మిద్దెపై అనేక రకాల మొక్కలు పెంచుతూ అధికారులు, స్థానికుల మన్ననలు పొందుతున్నారు.

విద్యార్థి దశలోనే పర్యావరణ స్పృహ

అగనంపూడి కొండయ్యవలస నిర్వాసితకాలనీకి చెందిన పట్టా రామ అప్పారావు చదువుకొనే రోజుల్లోనే ఆక్సిజన్ ఉపయోగాలు, చెట్ల నుంచి విడుదల అయ్యే ప్రాణవాయువు గురించి అవగాహన పెంచుకున్నారు. అప్పటి నుంచే పూలు. పండ్లు మొక్కలు పెంచడం అలవాటు చేసుకున్నారు. ఉద్యోగం చేసినా సామాజిక కార్యక్రమాలు కొనసాగించేవారు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఏకంగా ఇంటినే ఉద్యానవనంగా మార్చేశారు.

40 రకాలు.. 200 మొక్కలు

40 రకాలు, 200 వందల మొక్కలకు ఆయన ఇంటి ఆవరణ వేదిక అయ్యింది. పూల మొక్కలు, పండ్ల చెట్లతోపాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించే స్పైడర్ మొక్కలు, ధూళిని ఒడిసిపట్టే జిజియా మొక్కలను మెట్లు, మిద్దెపై పెంచుతున్నారు. ఈ మొక్కలకు పది రోజుల వరకూ నీరు అందివ్వకపోయినా జీవించే లక్షణం ఉండడంతో రోజు నీరు పెట్టాలనే బాధ ఉండదు.

విభిన్న రకాల మొక్కలకు చోటు

పెరడు, మిద్దెపై పూలమొక్కలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఆయుర్వేద వన మూలికలుగా ఉపయోగపడే నిమ్మగడ్డి, గోధుమ గడ్డి, ఉత్తరేణి, క్యాక్టస్ మొక్కలు పెంచుతున్నారు. మొక్కల పెంపకానికి తక్కువ ఖర్చు అయ్యేలా వాడి వదిలేసిన పాత దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలను కుండీలుగా వాడుతున్నారు. వాటికి కళాత్మకతను జోడించి రంగులు అద్దుతూ ఆకర్షణీయంగా, అందంగా రూపొందించి వ్యర్థాలు అనే భావన కలగకుండా వాటికి రూపుదిద్దుతున్నారు.

నీటి పొదుపు కూడా..

శ్లాబ్‌కు హుక్కులు పెట్టి మూడు అంతస్తుల్లో మొక్కలు వేలాడదీస్తూ ఒక కుండీ నుంచి మరో కుండీలోకి నీటి బొట్లు పడేలా ఏర్పాటు చేశారు. నీరు వృథా కాకుండా చేస్తున్నారు.

అధికారుల ప్రశంసలు

ఇంటి పెరడును పరిశీలించడానికి గత జీవీఎంసీ కమిషనర్ లక్షీశ, డీఎంఅండ్‌హెచ్‌వోలు జయరామ్, పలువురు కార్పొరేటర్లు పలుమార్లు సందర్శించి మెచ్చుకున్నారు.

మాకు ప్రాణాధారం ఇవే...



కరోనా కష్టకాలంలో మాకు ప్రాణాధారంగా నిలిచాయి. కరోనా బారిన పడకుండా ఉన్నామంటే ఇంటి ఆవరణలో మొక్కలే కారణం. స్వచ్ఛమైన ప్రాణవాయువును పీల్చుకొనే అవకాశం దక్కుతుంది. ఎటువంటి వ్యయప్రయాసలకు గురికాకుండా వ్యర్థాలతో కుండీలు చేసి మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని నివారించడంతోపాటు స్వచ్ఛమైన గాలి పొందుతున్నాం. మొక్కలను పెంచడం వల్ల కలిగే ఆనందం, అనుభూతి చెప్పలేనిది.

– పట్టా రామ అప్పారావు, 85 వార్డు, ఆర్‌హెచ్ కాలనీ, అగనంపూడి



ఇంటి ఆవరణలో పెంచుతున్న ఆయుర్వేద గడ్డి



మేడపై పెంచుతున్న మొక్కలు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ



అక్కిరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న సిటూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో విశాఖ డెయిరీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని సిటూ, డెయిరీ కార్మికులు, నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిటూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడడంలో విఫలమయ్యాయన్నారు.ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.రమణ, రాంబాబు, లోకేష్, ఎస్.జగన్నాథరావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ టోలిక్‌కు అధికార భాషా పురస్కారం



అవార్డు అందుకుంటున్న టోలిక్ మెంబర్ సెక్రటరీ లలన్‌కుమార్

ఉక్కునగరం: కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ అధికార భాషా పురస్కారాన్ని విశాఖ టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (టోలిక్)కు మూడో బహుమతిని ప్రకటించారు. కర్ణాటకలోని మైసూర్‌లో శనివారం నిర్వహించిన దక్షిణ-పశ్చిమ రాష్ట్రాల ప్రాంతీయ ఉమ్మడి అధికారిక భాషా సదస్సులో ఈ బహుమతి అందజేశారు. బిహార్ గవర్నర్ డాక్టర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్, మైసూర్ ఎంపీ యదువీర్ చామ్‌రాజ్ సమక్షంలో హోం మంత్రిత్వశాఖ అధికార భాషా శాఖ కార్యదర్శి అన్సులి ఆర్య చేతుల మీదుగా టోలిక్ మెంబర్ సెక్రటరీ, స్టీల్‌ప్లాంట్ హాస్పిటాలిటీ జీఎం డాక్టర్ లలన్ కుమార్ అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం



అగనంపూడి కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

అగనంపూడి: ఎదిగే పిల్లలకు పోషక విలువలతో కూడిన భోజనం అవసరమని ప్రభుత్వం గుర్తించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు ఈ పథకం కూడా భాగం అవుతుందన్నారు. పిల్లలు సరైన సమయంలో భోజనం చేయాలని అప్పుడే ఎదుగుదల ఉంటుందన్నారు. అలాగే కళాశాల ప్రహరీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు, 79, 85 వార్డుల కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి, నాయకులు కోన తాతారావు, విజయ్, వెంకటరావు, దశేంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జె. వివేకానందరావు, రషీదా బేగం, యాకబ్, ఎం.రవి, దావూద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కరుణాకరరావు



రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన కరుణాకరరావు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడకకు చెందిన ఉక్కు ఉద్యోగి విందుల వెంకట కరుణాకరరావు జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. వారం రోజుల కిందట గుంటూరులో జరిగిన ఆరో రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని మూడు పసిడి పతకాలు, ఒక కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఫిబ్రవరిలో కేరళలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన తెలిపారు. పెదమడకలోని సహచరులు ఆయన్ను అభినందించారు.

సింటర్ ప్లాంట్ ఘటనలు పునరావృతం కాకూడదు



సింటర్ విభాగంలోని ప్రమాద స్థలాన్ని సందర్శించిన రాజశేఖర్, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సింటర్ ప్లాంట్ విభాగంలో ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణమే యాజమాన్యం చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విభాగాధిపతి మొహంతితో ప్రమాదం జరిగిన తీరు.. భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ మెయింటెనెన్స్, క్లీనింగ్ లేకపోవడం వల్ల గ్యాలరీ బరువు పెరిగి కూలి పోయిందన్నారు. అదృష్టవశాత్తు ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడం వల్ల ఎటువంటి ప్రాణాపాయం వాటిల్లలేదన్నారు. ఇకనైనా యాజమాన్యం చర్యలు తీసుకొని మరే ఇతర యూనిట్లు, విభాగాల్లో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభాగం కన్వీనర్ డి.వి.కె. రాజు, ఎస్.ఎ. నాయుడు, కె.వి.డి. ప్రసాద్, రాంబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఓబీసీ అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్ ఓబీసీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా ఖ్యాతి గాంచిన సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎస్. భాను, హెచ్‌ఆర్ డీజీ ఎండీ రాధిక, ఉక్కు జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత, ఓబీసీ లైజన్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు సావిత్రిబాయి పూలే గొప్పతనాన్ని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి. అప్పారావు తమ సంఘం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన ఓబీసీ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీంను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు ఉపాధ్యాయినులను సత్కరించారు. అసోసియేషన్ నాయకులు ఎస్. శ్రీనివాసరావు, ఆర్.వి. నారాయణ, కొయిలాడ శ్రీనివాస్, యు. శ్రీనివాస్, బి. కామేశ్వరరావు, జి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు తక్షణం చెల్లించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కార్మికులు శనివారం విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. యాజమాన్యం వద్ద వేతనాలకు సరిపడే ధనం ఉన్నప్పటికీ కక్షపూరితంగానే వ్యవహరిస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వం తన తాబేదారులకు ప్లాంట్‌ను కట్టబెట్టాలనే ఈ చర్యలకు దిగిందని ఆరోపించారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో కమిటీ ప్రతినిధులు అయోధ్యరామ్, యు. రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, రమణమూర్తి, టి.వి.కె. రాజు, వి. ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలకే బీజేపీ మొగ్గు



భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: కేంద్ర ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం అని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. సంస్థ ప్రధాన గేటు వద్ద శనివారం సిటూ ఆధ్వర్యంలో ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. చండీఘర్‌లో విద్యుత్ ప్రైవేటీకరణ వల్ల భెల్‌లో కూడా విద్యుత్ తయారీపై ప్రభావం చూపుతందన్నారు. గతంలో భెల్‌లోని అన్ని యూనిట్లలో 60 వేల మంది ఉద్యోగులు ఉండేవారని.. ఇప్పుడు 28 వేల మంది మాత్రమే ఉన్నారన్నారు. గతంలో విశాఖపట్నం భెల్‌లో 4000 మంది ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 680 మందికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్.జగన్నాథం, కె.నారపురెడ్డి, ఎస్.వి.శ్రీనివాసరావు, కె.విజయ్‌కుమార్, ఎ.అప్పలనారాయణ, బి.కృష్ణమూర్తి, జి.అచ్చన్నారాయణ, ఎస్.అప్పారావు, పి.శివరాంతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

పదవీవిరమణ చేసిన సుబేదార్‌కు ఘన స్వాగతం



ఆర్మీ సుబేదార్ కంపర శ్రీను దంపతులకు ఘన స్వాగతం పలికిన కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: మాతృభూమి సేవలో 30 సంవత్సరాల 10 రోజులు పనిచేసి 2024 డిసెంబర్ 31న ఆర్మీ సుబేదార్‌గా పదవీ విరమణ చేసి స్వగ్రామం అక్కిరెడ్డిపాలెం చేరుకున్న సైనికుడికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. వెటరన్ వారియర్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సుబేదార్ కంపర శ్రీను దంపతులను జీప్పుపై జాతీయ జెండాలతో బాణసంచా కాల్చుతూ స్వాగతం పలికి ఆయన నివాసానికి ర్యాలీగా తోడ్కొని వచ్చారు. ఆయన ముందుగా తాను చదివిన అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చేరుకున్నారు. అక్కడ ఉపాధ్యాయులతో స్కూల్‌తో ఆయనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. అప్పటి స్కూల్ పరిస్థితుల, ఇప్పటి పరిస్థితి చూసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం సుబేదార్ దంపతులను పూలమాలలతో సత్కరించి వారిచే కేక్ కట్ చేయించారు.

కొమ్మలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం స్కూల్ రోడ్డులో కరెంట్ తీగలకు తాకిన చెట్టుకొమ్మలను శనివారం విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించారు. 'పొంచి ఉన్న ముప్పు' అనే శీర్షికతో శనివారం ప్రచురితమైన వార్తకు మింది విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఆదేశాల మేరకు సిబ్బంది కరెంట్ తీగలకు తాకుతున్న చెట్టు కొమ్మలు తొలగించారు.

విజయవాడ తరలిన విశ్వ హిందూ పరిషత్ సభ్యులు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న సభ్యులు

పెదగంట్యాడ: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహించనున్న హైందవ ధర్మం ప్రసంగం కార్యక్రమానికి పెదగంట్యాడ ప్రాంతం నుంచి విశ్వహిందూ పరిషత్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ మేరకు గొందేశి గురప్ప రెడ్డి ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి వారంతా విజయవాడ బయల్దేరారు. వి.నాగబాబు, వీరేశ్వరరావు, కాకి లోకేష్, వేణు, చాముండేశ్వరి, కోటేశ్వరమ్మ, పార్వతి, పద్మిని తదితరులు ఉన్నారు.

క్రికెట్ జట్లకు జెర్సీల అందజేత



క్రికెట్ జట్లకు జెర్సీలు అందిస్తున్న కోమటి శ్రీనివాసరావు, నిర్వాహకులు

అగనంపూడి: సంక్రాంతిని పురస్కరించుకొని డబ్ల్యూసీపీఎల్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న జట్లకు శనివారం వడ్లపూడిలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు జెర్సీలను అందించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకొని క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది లీలా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డ గోవింద్, ఆదారి శ్రీను, వడ్లపూడి ఈశ్వరరావు, వందేభారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి వినోద్‌బాబు, కాంద్రేగుల దినేష్‌పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

అగనంపూడి: భరతజాతి ముద్దుబిడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథరావు అన్నారు. అంబేడ్కర్ మహాపరి నిర్వాణ దిన్ సందర్భంగా శనివారం సిద్ధార్థనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు విజయరామరాజు, జేఎస్‌మూర్తి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు పరారైన యువతి

అగనంపూడి: ఇంటి నుంచి పరారైన యువతిని దువ్వాడ పోలీసులు వెతికి పట్టుకొని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ కె. మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గత శుక్రవారం నిర్వాసితకాలనీకి చెందిన యువతి (19) ఇంటి నుంచి చెప్పాపెట్టకుండా పరారైంది. ఆమె తండ్రి దువ్వాడ పోలీసులను ఆశ్రయించడంతో సీఐ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విజయవాడలో ఉన్నట్టు గుర్తించి ఒక్క రోజు వ్యవధిలో ఆమెను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

మూడో అంతస్తు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

మృతుడిది జైపూర్ ప్రాంతం



ఆత్మహత్యకు పాల్పడిన శంకరరావు

అగనంపూడి: మంగళపాలెం జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలోని బహుళ అంతస్తు పై నుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన మాడుకొండ శంకరరావు (41) ఉపాధి కోసం తొమ్మిదేళ్ల కిందట విశాఖ వచ్చి పరవాడలోని ఫార్మాకంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. భార్య నాగమణితో కలిసి మంగళపాలెంలోని జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో నివాముంటున్నారు. శనివారం ఉదయం మేడపైకి వెళ్లి మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.